"ఐరావతం చూపుడువేలితో బెదిరిస్తూ, కళ్ళలో కోపం ప్రదర్శిస్తున్నాడు. ఆ కుర్రాళ్ళు ముగ్గురూ భయం భయంగా తలలూపుతున్నారు. చెబుతున్నదేమిటో అర్థంగాలేదు. పిన్స్ ఎత్తుకుపోవడమేమిటి?"

నాకు కథలంటె యిష్టం. సెంటిమెంటు కథలు సెంటిమీటరుకూడా వదలకుండా చదువు తాను. ప్రేమ కథలంటే మరీ మక్కువ. నలభయ్యో పడిలో యివాళో, రేపో పడబోతున్నా పదహారేళ్ళ పడుచులతో ప్రణయ పల్లాపాల చెరుకుపానకం మరెంతో యిష్టం.

ప్రేమ కథలు మనల్ని బాహ్యప్రపంచపు రొచ్చులోంచి, రాలిపోయిన అనుభవాల మధురోహల మరో లోకంలోకి చల్లచల్లగా తీసుకుపోయి మైమర పించి మత్తెక్కిస్తాయి; ప్రయాణాలలో మరీను.

# పిన్స్

## ఆర్. యస్. కృష్ణమూర్తి



ఆఫీసు పనిమీద బొంబాయి బయల్దేరేను కంపెనీ ఖర్చుతో. ఫస్టు క్లాసులో ప్రయాణం చేస్తూ బెర్తుమీద కాళ్ళు బార చాపి. నాకు అత్యంత ప్రియతమ రచయిత్రి ప్రేమలతా వేంకట రమణమూర్తి 'ప్రేమవల' నవల చదువుతూ మైమరచి వున్నాను. కిటికీలోంచి వెనక్కు పరిగెడుతూ ప్రకృతి కనబడుతున్నా ఆ సౌందర్యాన్ని ఆస్వాదించే అభిలాష యెప్పుడూ లేదు నాకు. అప్పటికి చదివిన ఆరువందల పేజీల ప్రేమాయణం మత్తెక్కించి కళ్ళు సలుపుతున్నాయి. వదలాలని లేకపోయినా, చదివిన పేజీదగ్గర చూపుడువేలుంచి మిగిలిన వేళ్ళతో పుస్తకం మూసేను. తల కిటికీవేపు తిప్పేను.

అప్పుడు కనిపించేయి. ముందుకు మందాను.

స్వర్గంలోకి అడుగు పెట్టబోతున్న వాడ్ని ఒక్కతోపుతో పాతాళానికి తోసినట్టు అవి నన్ని లోకంలోకి తెచ్చి పడేసేయి. ఎన్నున్నాయంటే - లెక్కలేనన్నంటే!.... అబ్బ!.... నల్లశాసపు బండల్లా.... చిక్కిపోయిన ఏనుగుల్లా.... గునగున నడుచుకుంటూ....గుర్రుగుర్రుమని అరుచుకుంటూ.... ఓహ్!.... ఒళ్ళు జలదరిస్తూంది!.... ఆ ప్రదేశాన్నంతా నల్లగా కప్పేశాయి.

ఏదో పెద్ద స్టేషను రాబోతూందన్నమాట.

అదేదో పెద్ద మార్షలింగ్ యార్డు అను

కుంటాను. వందలకొద్దీ రైలు పట్టాలు సమానాంతరంగా పరుగులు తీస్తున్నాయి చాలా లైన్లమీద గూడ్సు పెట్టెలున్నాయి. పదో పదిహేనో రైలింజన్లు – స్టీముపీ. డీజల్‌వీ. ఎలక్ట్రిక్‌వీ — సందడి చేసుకుంటూ అట్నించిటూ. ఇట్నించటూ కూతలు వేసుకుంటూ తిరుగుతున్నాయి. కొన్ని వేగన్లమీద రైలు కమ్మీలూ ఇంకొన్ని వేగన్లమీద ఉక్కు దూలాలూ. మరి కొన్నింటిమీద ఉండలుండలుగా చుట్టివున్న ఉక్కు తీగలూ. ఇలా ఎక్కువ భాగం రకరకాల ఆకారాలలో ఉక్కు సామాగ్రి కనిపిస్తూంది. దూరంగా డజనో. రెండు డజన్లో పొగ గొట్టాలు ఆకాశాన్ని అవిరామంగా పొగతో కలుషితంచేస్తూ అజ్ఞాని గర్వంలా నిలుచున్నాయి. రైలు పట్టాల కిటూ అటూ ఎలక్ట్రిక్ స్తంభాలు బారులుతీర్చి పెరేడ్‌చేస్తున్న సైనికుల్లా నిల్చున్నాయి. ఒకదాన్నొకటి కలుపుతూ ఎలక్ట్రిక్ వైర్లు. దూరంనుంచిచూస్తే ఆకాశమంత పందిరి వేసినట్టు గోచరిస్తూంది ఆ యార్డు.

ఉన్నట్టుండి ఏవో అరుపులూ. కేకలూ వినబడ్డాయి. దూరంగా ఎక్కడో మైక్‌లో ఒక బొంగురుపోయిన గొంతుక పెద్దగా అరుస్తూంది. దాన్ని అనుసరిస్తూ కొన్ని వందల కంఠాల ఘోష. ఏమిటో బోధపడదు. రైలాగిపోయింది. కేబిన్లోంచి ఒక వైపే కనబడుతూంది. రెండో వైపు కేకలూ. గోలా— ఏమీ తెలియడం లేదు. కేబిన్లోంచి కారిడార్‌లోకి వచ్చేను కంపార్టుమెంట్ తలుపుదగ్గర నుంచుని అరుపులు వినబడుతున్న వైపుకిచూసేను. రెండు మూడు వందలమందిదాకా వుంటారేమో. అందరికీ తలకి గుడ్డలూ మాసిన బట్టలూ. కర్రలకు తొడిగిన ఎర్రటి బేనర్సు యిద్దరేసి కలిపి పట్టుకుని. ఒకడు చేసిన నినాదానికి మిగిలిన వాళ్ళంతా ప్రతినినాదం చేసున్నారు. ఆవేశంతో చేతులు యెగరేస్తూ అరుస్తూంటే వాళ్ళ మెడల దగ్గర పట్టిన చెమటమీద వుబ్బిన నరాలకు ఎండ స్పాట్‌లైట్ వేస్తూంది. బేనర్లమీద అక్షరాలు దూరంనించి కనబడలేదుగాని యిదేదో స్ట్రైకు గొడవే.

ఏసుగా ఫస్టు క్లాసు కండక్టరు ఛార్టు పట్టుకుని వస్తున్నాడు

"ఏమిటండీ ఈ గొడవ?" అని చికాకుగా ఇంగ్లీషులోఅడిగేను-అతను తెలుగువాడేనని అతని నల్లకోటుకు తగిలించివున్న పేరు చెపుతున్నా

"అడక్కండి సార్! మూడు రోజుల నుంచీ ఇదేవరస! లోకో వర్కర్లంతా సమ్మె చేసున్నార్లే" అన్నాడు కండక్టరు తెలుగులోనే - "నువ్వు తెలుగువాడివే నాకు తెల్సు"నన్నట్టు.

"అయితే ఈ లోకులంతా లోకో వర్కర్లా?"— అంటూ ప్రాసించేను.

"సరిగ్గా పన్నెండు గంటలయేసరికి రోజూ రెండుగంటలసేపు ఎక్కడి రైళ్ళక్కడే ఆపేసి ఇంజను దిగిపోతున్నారు."

"అంటే రెండుగంటలవరకూ ఇది కదలదా ఏమిటి?"

"అన్నమాటే!" అన్నాడతను నవ్వుతూ. "రైలుదిగి డ్రైవరూ. ఫైర్‌మనూ ఆ మందలో కలిసిపోయేరు. అరచి అరచి రెండింటికే తిరిగొస్తారు."

ఇంకా రెండు గంటలసేపు ఈ ప్రదేశంలో వుండాలంటేనే భయంగా వుంది. రానురాను అరుపులు పేట్రేగుతున్నాయి. మెల్లిగా కంపార్టుమెంటుకి రెండోవైపు ప్లాట్‌ఫారంమీదికి దిగేను నా ముందు పెద్ద మార్షలింగు యార్డు నించుంది మౌనంగా. ఇందాక అటూ యిటూ తిరుగుతూన్న ఇంజన్లు యెక్కడి వక్కడే నిలుచుండిపోయేయి.

"రేయ్ · ఇట్రండ్రా:" అన్న కేక వినబడింది. కంపార్ట్‌మెంట్‌ వేపుచూసేను అక్కడ రైల్వే కేటరింగు బేరరు ఒకడు నిలబడి వున్నాడు. దూరంగా జాపివున్న వాడి రెండు కాళ్ళమధ్యనూ పాతిక ముప్పై భోజనప్పళ్ళాలున్నాయి.

"రేయ్! మిమ్మల్నేరా! నాయాళ్లా పిలుస్తుంటే వినబడదేట్రా? నష్టి కొడకల్లారా.... సెవుడేటి?" అరుస్తున్నాడు బేరరు

'ఎవర్నా అంత ప్రేమగా పిలుస్తున్నాడ'ని వాడు చూస్తున్న వేపు చూసేను. అక్కడో ముగ్గురు పిల్లలున్నారు ఎనిమిదీ పదేళ్ళ మధ్య వయసుంటుందేమో నల్లగా ఒళ్ళు. ఒంటి మీద మాసిపోయి అట్టగట్టుకుపోయిన మాసికల నిక్కర్లూ. చింపిరి జుట్లూ వాళ్ళను చూస్తూంటే ఇందాక చూసిన గుర్రుగుర్రుమని తిరిగిన పందుల మంద గుర్తుకొచ్చింది. మనుషుల్లో వుండవలసినవాళ్ళులా లేరు.

వాళ్ళు బేరరువేపు చూసేరు. చూసీ చూడగానే వాళ్ళలో ఎక్కడలేని చైతన్యం పుట్టుకొచ్చింది. ఒక్క ఉదుటున ముగ్గురూ కంపార్టుమెంటు దగ్గరకి పరుగెత్తేరు ఒకడితో ఒకడు పోటీపడుతూ భోజనం పళ్ళేలు అందుకుంటున్నారు.

"ఆగండెహె! ఏట్రా తొందర? నష్టి కొడకల్లారా! కప్పులుగా నెత్తీసినారంటే ఎవుకలెగిరిపోగలవు జాగర్త! మెల్లిగొట్టుకెల్లి అల్లా పెట్టాకాడెట్టండి" అని ఆర్డరు జారీచేసి. ఇంకో కంపార్టుమెంటులోకి దూరేడు బేరరు.



బతుకంతా శిలువ

మెళ్ళో కొండచిలువ!

—ఫొటో: బోనేపల్లి మురళి. తెనాలి

## జగమే మాయ

భ్రాంతల్ని ఒంటికి తొడుక్కుని
బార్‌లో విస్కీకుంటున్నప్పుడు
గుర్తుకొచ్చింది భార్యామణి
దాంతో
వండుకున్న బియ్యం- కట్టెల్లేని
పొయ్యి
చంటాడికి ఆటలమ్మ- పెద్దాడికి
పోలేరమ్మ
కడుపులో సన్నగా చలిమంట—
నన్ను చూస్తున్న బార్‌వాలాకి
అర్జంటుగా చలిజ్వరం వచ్చి
నా ముందు మూడు పెగ్గులు!!
వాటి వంచుకున్న నేను
ఆకాశంలో అమరానంగా
'జగమేమాయ' పాడుకుంటున్నాను.

—భైరవయ్య



గిరగిరాం భూమధ్యం
గరగరాం బొంగరం
వాడుపు వలయంతో
బంధించే బాల్యం!

—ఫొటో : సి. హెచ్. మున్షీ. విజయవాడ

వాడిమాటింకా పూర్తికానేలేదు ఎవడి కందినవి వాడు తీసుకుని పరుగెట్టేరు. నేను ఆసక్తిగా వాళ్ళనే గమనిస్తున్నాను భోజనం పళ్ళాలన్నీ విడి విడిగా నేలమీద పరిచి అందులో మిగిలిపోయిన అన్నాన్నీ రొట్టె ముక్కల్నీ. కూరల్నీ ఆబగా తింటున్నారు వాళ్ళు.

"అబ్బ! ఏం రుసిగుందిరిది! ఆ బాబెందు కొగ్గీసినాడోగాని గొప్ప రుసి గుందిర!" అన్నాడు ఒకడు ఏదో ఆస్వాదిస్తు తింటూ.

"సీ! ఇందల ఏటీ నేదు! కసింతాగేత్తే ఏటైపోతాదో... మా దరమ పెబువు!" అని కోపంగా ఒక పళ్ళాన్ని దూరంగా పరేశాడు రెండోవాడు.

మూడో కుర్రాడు చాలా బిజీగా వున్నాడు. ఎవరో తినలేక వదిలేసిన పూర్తి భోజనం దొరికింది. వాడికివాళ పండుగే.

"ఎందలా ఏటీ దొరకనేదు. సీసీ!" అని విచారంగా మొహం పెట్టి అంటున్నాడు రెండోవాడు. పళ్ళాలన్నీ జాగ్రత్తగాచూసి పక్కనపడేసి వాడికేం దొరక్కపోగా పక్కవాళ్ళిద్దరూ ఏదో తినేస్తూండడం వాడికి మరింత బాధగా వుంది.

"ఓ రంజిగా! నాక్కసింతెట్రా. ఆకలి గుంది. నిన్న ఏలనించీ ఏటీ నేదు" అంటున్నాడు వాడు మూడోవాడి కంచం నిండుగా వుండడం చూసి.

"ఎల్లెల్రా! నాను మాత్రవేటి మేయిస్పినా నేటి!.... నా కాకల్నేదా?.... ఎవుడ దురుష్టం వాడిదే!"

"నంజికొడుకు! సూద్రారే. ఒక్క ముద్దేనా ఎట్టకుండా తినేత్తన్నాడు" అని మొదటి కుర్రాడితో కంప్లెంట్ చేసి. "మల్నన్నడగవా. అప్పుడు సెప్పనా!" అని బెదిరించేడు. దాని ప్రభావం ఏమీ లేదని తెలిసేక. వాడూరుకున్నా వాడి ఆకలి వూరుకోలేదు

"కసింతొగ్గేత్తేటి నీ సొమ్మేంటి పోనాదేట్రా?" అని రోషంగా అరిచి మళ్ళీ "రొండు ముద్దలన్న వొగ్గీరా" అన్నాడు కాళ్ళ బేరానికి దిగి. వాడేం వులక్కపోవడంతో. దగ్గరకెళ్ళి కంచంలో చెయ్యి పెట్టేసేడు.

"ఏట్రో జబర్దస్తీ సేత్తన్నడు నంజికొడుకు! సంపీగల్ను నాయాల!" అని మోచేత్తో ఒక్కటిచ్చుకున్నాడు. ఉన్నవాడు లేనివాడు కలియబడ్డారు. కొట్లాటలో ఆ కంచంలోది కాస్త కింద పడింది ఒక చేత్తో దెబ్బలాడుతూనే రెండో చేత్తో నేలమీద పడ్డదాన్ని నోటబెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు ఇద్దరూను.

నా కెంతో చీదరగా. జుగుప్సాకరంగా వుంది వాళ్ళ ప్రవర్తన. ఛీఛీ! వీళ్ళు నాకు తున్న ఈ కంచాలలోనేనా ఫస్టు క్లాసులో కూర్చుని మేమూ తినేది? రైల్వే అధికారులంతా ఏం చేస్తున్నట్టు? ఇలాంటి ముష్టి వెధవలకి భోజనం పళ్ళాలన్నీ అప్పజెప్పేస్తే ఎక్కడలేని రోగాలూ అంటుకుంటాయి కూడాను మరి అటు చూడలేక తల తిప్పేసుకున్నాను.

"దొంగనాయాల్లారా! ఏట్రా చేస్తున్నారు? లెండి" అన్న అరుపూ. దబదబ పడ్డ దరువుల చప్పుడూ విని మళ్ళీ అటు తిరిగేను.

ఆ గుంట వెధవల్ని కాలితో తంతూ. అరుస్తున్నవాడ్ని ఆసక్తితో చూసేను. తెల్లటి పొడుగైన లాల్చీ. గ్లాస్కో పంచే కట్టేడు. నోట్లో కారాకిళ్ళీ బిగించేడు. మాట్లాడినప్పుడల్లా తుప్పు తుప్పు ఎర్రటి ఉమ్మి బయటకొస్తూంది నెత్తినో గుజరాతీ టోపీ వాడి తల కప్పడానికి విఫలయత్నం చేస్తూంది రమారమి ఆరడుగుల ఎత్తున్నప్పటికీ బాగా ఒళ్ళుండడంవల్ల ఐదడుగులకంటే కనబడడు విగ్రహంలో చూడగానే ఆకర్షించేది వాడి పొట్ట. ప్రపంచంలోవున్న ఐశ్వర్యం అంతా ముద్దగాచుట్టి మింగేసిన వాడిలాగో. లేకపోతే భూగోళం అంతా కబళించిన వాడిలాగో గోచరిస్తుంది. ఈ భూప్రపంచం అంతా తనదేనన్న ధీమా వాడి మాటలూ. చేతలూ ప్రకటిస్తున్నాయి. మాట్లాడుతున్నప్పుడు బయటకు చొచ్చుకు వచ్చే వాడి పెద్ద పారపళ్ళకున్న బంగారపు తొడుగులూ అదే ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే వాడు ఐరావతంలాగో. మేరు పర్వతం లాగో వున్నాడు.

ఆ గుంట వెధవల్ని వాడు కాలితో తన్నినందుకు వాడిమీద నాకు కోపంరాలేదు సరికదా. నేనుచేద్దామనుకునిచెయ్యలేకపోయిన పని వాడు చేసినందుకు సంతోషించేను కూడాను. తమాషా ఏమిటంటే తన్నులు తిన్నందుకు ఆ గుంటవెధవల మొహాల్లో కొంచెం కూడా బాధ కనబడలేదు వెంటనే వాళ్లు ముగ్గురూ ఐరావతం కాళ్ళు పట్టేసుకున్నారు.

"బాబూ! దరమ పెబువులు బాబో! ఒక్క పావలాడెయ్యండి బాబో! నాల్రోజులైంవండి బాబో తిండినేదండి! ఏటీ దొరకనేదండి.

"మీ కాల్లొత్తుకుంతానండి! నాన్నగారండి! కన్న తండులండి బాబో!.... వది పైసలేనాడెయ్యండి బాబో!"


"ఛీ! తొత్తుకొడకా! ఎవడ్రా నీకు నాన్న? కాలొదులు. పళ్ళు రాలిపోగలవు!

పనీ పాటా చేసుకోరాదురా పోతుల్లాగున్నారు?"

"పనెవరిత్తారు బాబో! కూలి సేత్తావంటే పో తొత్తుకొడకాని తరివేత్తన్నరు. ఏటి జెయ్యమంతారు బాబూ! దయ తలసండి బాబో! మీ బిడ్డల్లాటోలం!"

"ఛప్! మళ్ళీ అదేమాట! గుంట వెధవల్లారా. ఇంకెవళ్ళ దగ్గరేనా చెప్పండ్రా మీ కథలు. నా దగ్గర కాదు.... నేను పనియిస్తాను చేస్తార్రా? ముగ్గురికీ తలో రూపాయీ ఇస్తాను."

"ఏటీ.... రూ....పా....యే!" ముగ్గ



తెలుగు పలుకుల బాల కాశ్మీర హేల !

ల్లోనూ నమ్మలేని ఆశ్చర్యం.

"చెప్పండర్రా గాడిదల్లారా ! పందుల్లా పూరిమీదపడి తినకపోతే కష్టపడి పని చేసుకు బతకండ్రా .... లేదంటారా వెధవల్లారా ! పోలీసోడి కప్పజెప్పేస్తాను !"

ముగ్గురి ముఖాల్లోనూ భయం తొంగి చూస్తోంది. చెప్పొద్దూ! నాకు సరదా వేసింది ఇలాంటి రికామీగా తిరిగే వాళ్ళకి అలాటివాళ్ళే మందు.

"సెప్పండి బాబో ! పనేటో" అన్నారు ముగ్గురూ ముక్తకంఠంతో.

"అలా దారికి రండి! పదండి" అని యార్డులోకి దారి తీసేడు ఐరావతం. వాళ్ళ వెనకే నా కళ్ళు ఆసక్తిగా కదిలాయి.

దూరంగా యార్డులో ఒక లైనుమీద వున్న వేగను దగ్గర ఆగేరు ఏదో గునపం లాటిది కిందనుంచి తీసి ఐరావతం వేగను తలుపు మీద కొట్టి దూరంగా వచ్చేడు. తలుపు గడియ విడింది. అందులోనుంచి రెండు మూడు ఇనపదుక్కలు కిందికి పడ్డాయి అవి చూపించి కుర్రాళ్ళ కేదో చెప్తున్నాడు ఐరావతం చేత్తో లైన్లకి అవతలివైపుకి చూపిస్తున్నాడు. కుర్రాళ్ళ మొహాల్లో మరింత భయం! చేతులు అడ్డంగా తిప్పుతున్నారు. ఐరావతం చూపుడు వేలితో జడిపిస్తూ. కళ్ళలో కోపం ప్రదర్శిస్తున్నాడు ఏదో చెప్పేడు. ఆ కుర్రాళ్లు ముగ్గురూ భయం భయంగా తలలూపేరు

ముగ్గురిలో ఒకడ్ని ఐరావతం వేగన్లోకి ఎక్కించేడు. వాడు ఎత్తలేక ఎత్తలేక ఒక ఇనపదిమ్మ కిందకి తోసేడు. మిగిలిన ఇద్దరూ ఆ దిమ్మని మోసుకుంటూ లైన్లు దాటుకుంటూ పోతున్నారు.

దూరంనించి చూస్తూవుంటే మూకీ సినిమాలాగ వుంది. వాళ్ళను గమనించడంలో తాత్కాలికంగా మరిచిపోయిన రైల్వేపనివాళ్ళ అరుపులు మళ్ళీ చెవుల్లో గోలచెయ్యడం మొదలెట్టేయి. కంపార్టుమెంట్‌లోకి ఎక్కి నా కేబిన్ తలుపులువేసి కిటికీ తలుపులు కూడా మూసేశాను. పుస్తకం తెరిచేను. ప్రేమలతా వేంకట రమణమూర్తి ధర్మమాని క్రమంగా అరుపులూ కేకలూ నన్ను బాధించడం మానేశాయి.

మళ్ళీ ఈ లోకంలోకి వచ్చి టైం చూసేసరికి రెండుంపావయింది. ఇంకా రైలు ఎక్కడవున్న గొంగళి అక్కడే అన్నట్టుంది. అరుపులు ఆగిపోయేయి. కిటికీ తలుపులు తెరిచి చూసేను. యార్డులో సందడి తిరిగి ప్రారంభమైంది. మరి మా ట్రైను కదలదేం? చిరాగ్గా ౘచేను. తలుపు దగ్గరికి నడిచేను. బయట ప్లాట్‌ఫారం మీద కండక్టరు నిలబడి వున్నాడు.

"ఎప్పుడు బయల్దేరుతుందండీ ట్రైను ?.... మీరన్న రెండు గంటలూ ఎప్పుడో అయిపోయేయి" అన్నాను.

"ఈ దేశంలో రైళ్ళు ఎప్పుడు బయలుదేరుతాయో, ఎప్పటికి చేరుతాయో ఎవరు చెప్పగలరండీ ?.... ఏదో ఇంజను ట్రబులుట. నా శ్రాద్ధం! అంతా వట్టిదే! ఏదోలా పాసింజర్లకి ఇబ్బంది కలిగించడమే వాళ్ళ ధ్యేయం" మరో తోటి ప్రయాణీకుడు. బాగా విసుగెత్తిపోయున్నాడు కాబోలు-జవాబిచ్చేడు.

ప్లాట్‌ఫారం మీదకు దిగేను. మరెందుకొచ్చిందో ఏమో! మొదట్లో చూసిన పందులమంద జ్ఞాపకం వచ్చింది. ఇటూ, అటూ చూస్తుంటే గుర్‌గుర్‌మంటూ పందులు తిరుగుతున్నాయి ప్లాట్‌ఫారం మీద! వాట్లని చూస్తూనే ఆ ముగ్గురు కుర్రాళ్ళూ జ్ఞాపకం వచ్చారు.... కొన్ని కొన్ని ఎంత వద్దనుకున్నా. ఎంత అయిష్టమైనా పదేపదే గుర్తుకొచ్చి సాధిస్తాయి.... వాళ్ళకోసం కళ్లు యార్డులో వెతకడం ప్రారంభించేయి. ఇంకా అలా ఇనపదుక్కలు మోస్తూనే వున్నారు. 'పాపం ! పసి వెధవలు !' అనిపించిన జాలిని లోలోపలే అణగదొక్కి "మనిషన్నాక కష్టపడాలి; సంపాదించాలి" అనుకున్నాను.

అయితే ఆ క్షణంలో నేనూ మనిషినేనా లేక మానవాతీతుడ్నా అనిగాని మనిషినే అయితే నేను కష్టపడుతున్న దెంతవరకు అనిగాని ఆలోచించలేదు అలా ఆలోచించను కూడా లేకపోతే బతకలేం !

ఐరావతం కోసం నా కళ్ళు చూసేయి..

ఎక్కడో దూరంగా యార్డులోనే మూకీ సినిమాలో మరో భాగం కథ నడిపిస్తున్నాడు. ఈసారి అతనితో రైల్వే పోలీసు వున్నాడు. తీవ్రంగా చర్చలు సాగుతున్నాయి. బుర్రలు అడ్డంగా వూగుతున్నాయి. చేతులు కిందకీ, మీదికీ కదులుతున్నాయి లాల్చీ జేబులోంచి ఐరావతం ఏదో తీసి రైల్వేపోలీసు చేతిలో పెట్టేడు. వాడు బుర్ర అడ్డంగా తిప్పుతూ తిరిగి ఐరావతం చేతిలో పెట్టేసేడు. ఆఖరికి రైల్వేపోలీసు ఝడిపిస్తున్నట్టు చేతిలో లాఠీఎత్తి భుజానికి వేలాడుతున్న విజిల్ తీసేడు అప్పుడే ఒక ఇనపదిమ్మని మెల్లిగా మోసుకెళుతున్న గుంట వెధవలు కనబడ్డారు. ఆఖరుసారి రైల్వే పోలీసు ఐరావతంవేపు చూసేడు. చిరాగ్గా మొహంపెట్టి గట్టిగా విజిల్ వూదేడు.

"దొంగ! దొంగ! పట్టుకోండి! పట్టుకోండి !" అని అరుస్తూ కుర్రాళ్ళవైపుకి పరుగెత్తేడు రైల్వేపోలీసు.

ఈ ఆకస్మిక సంఘటనకి బెదిరిపోయి ఇనుపదుక్క కింద పారేసి, ఎటుపోవాలో తెలీక ఎటో అటు పరుగు లంకించుకున్నారు ఇద్దరు కుర్రాళ్ళూ. మరో ఇద్దరు ముగ్గురు రైల్వేపోలీసులు పరిగెత్తుకుంటూ వచ్చేరు ఎక్కడ్నుంచో.

"పట్టుకో ! పట్టుకో !" అరుపులూ పరుగులూ.

ఐరావతం తనకేం పట్టనట్టు గబగబ అడుగులు వేసుకుంటూ ప్లాట్‌ఫారం వైపుకు వచ్చేశాడు. దూరంగా ఎక్కడో ఒక ట్రక్కు స్టార్టయి కదలిపోతున్న చప్పుడు.

"ఏమిటండీ అక్కడేమయింది ?"

అనడుగుతున్నారు ఐరావతాన్ని ఎవరో పబ్లిక్ ఇన్ఫర్మేషన్.

"దొంగ లంజకొడుకులండీ! గుంట వెధవలే మళ్ళీ! పిగ్స్ ఎత్తుకుపోతున్నారు ఓ ముగ్గురు గుంటలు. పోలీసువాళ్ళ వాళ్ళ వెనకపడ్డారు.... వాళ్ళూ వాళ్ళూ ఒకటే నండీ. అందరికీ వాటాలుంటాయి. అంతా 'షో'" ఏమీ పట్టనట్టూ. ఏదో నిగూఢమైన రహస్యం చెప్తున్నట్టూ చెప్పేడు ఐరావతం.

ఇందాకట్నుంచీ చూస్తున్నాను తతంగం అంతా. ఎంత లేదన్నా కొంత బోధపడు తూనే వుంది అయినా అతగాడు చెప్తున్న దేమిటో అర్థం కావడంలేదు. పిగ్స్ ఎత్తుకుపోవడమేమిటి?

"పిగ్స్!? అంటే పందులా?" అనడిగాను ఆశ్చర్యం ఆపుకోలేక.

"పిగ్స్! మీకు తెలియదు కాబోలు. దుక్క ఇనుమిని ఇంగ్లీషులో పిగ్ ఐరన్ అనీ. తేలిగ్గా 'పిగ్స్' అనీ అంటారు. రైల్వే వేగన్లోంచి పిగ్ఐరన్ దిమ్మల్ని దొంగిలించి ఏ షావుకారుకో రూపాయికో. అర్ధకో అమ్మేస్తారు. రోజూ చూస్తూనే వుంటాం. మా కలవాటే. ఉక్కు ఫేక్టరీ పక్కనే వుందిగా. వాళ్ళకిదేపని" అన్నాడు

"మీరేం చేస్తూ వుంటారు?" అనడిగే నతణ్ణి.

'బిజినెస్ నా పేరు సోనాచంద్. మాది పెద్ద హార్డ్‌వేర్ వ్యాపారం. దేశంలో అన్ని మూలలకీ వెళ్తావుంటుంది మా సరుకు. 'సోనా' బ్రాండ్ పేరు వినే వుంటారు' అన్నాడు ఐరావతం గొప్పగా.

అవును నిజమే. 'సోనా' బ్రాండ్ ఇనప సామాను ప్రఖ్యాతి పొందిందే.

రైల్వేపోలీసు పరిగెత్తుకొంటూ ఐరావతం దగ్గరకి వచ్చేడు.

'ఏమిట'న్నట్టు వాడివేపు చూసేడు ఐరావతం.

"గుంటడు కునికిపేడు.... ఎదూరు గింజెనా స్తంచి.... ఆడు సూసుకోనేము.... పడిపోంచు....ముద్దయిపోండు... ఎంటనే పేనా లాగ్గిపేడు" అన్నాడు పోలీసు జనాంతికంగా.

వాడి కంఠంలో జాలి ఎంతుందో- నిష్ఠూరంకూడా అంతే వుంది.

"ఐతే ఇక్కడెందుకో చెప్పడం స్టేషన్లో చెప్పక?" అన్నాడు ఐరావతం. కోపంగా జనాంతికంగానే.

రైల్వే పోలీసు మరింత కోపంగా అతనివేపు చూసి. నిస్సహాయంగా నిట్టూర్చి. చరచర నడుచుకుంటూ వెళ్ళిపోయేడు దూరంగా వెళ్ళేక లాఠీతో కోపంగా రైలు పట్టాల మీద కొట్టడం కనబడింది!

నా మనసులో ఏదో కెలుకుతూంది. జరగరానిదేదో జరిగిపోయినట్టు తెలుస్తూనే వుంది. ఇందులో దోషులెవరో. దానికి బాధ్యులెవరో అంతుపట్టడంలేదు.

"ఏ ఊరపంది కని పారేసిందో దేశం మీద. ఇంతప్పట్నుంచీ దొంగతనం మరిగి పేరు. మరి దేశం ఏం బాగుపడుతుంది?"

న్యాయాన్ని శిక్షిస్తూ అన్యాయం చెప్పిన తీర్పులా వినబడుతోంది ఐరావతం మాట! అతడివేపు చూసేను.

నోట్లోంచి మూతిమీదకు కారిన కారాకిళ్ళీ మరకలు ఎర్రగా దారికలు కట్టి వున్నాయి నెత్తురు తాగి మూతి తుడుచుకోని వాడిలా కనబడ్డాడు ఆ క్షణంలో ఐరావతం.


మా రైలు కూతవేసి కదిలింది. గబగబ ఎక్కుదామనుకుంటూ వుండే—

ఎక్కడ్నించి వచ్చేయో – మందకు మందాను. గుర్రు గుర్రు మనుకుంటూ. గునగున నడుచుకుంటూ. చిక్కని ఏనుగుల్లా. నల్లకానపు బండరాళ్ళలా.... దేశాన్నంతా నల్లగా కప్పేస్తూ.... లేకపోతే నా భ్రమా?.... ఏమోమరి! ఏమైనా నా మనసులో పదేపదే "పిగ్స్" అన్నమాట గిరగిర తిరుగుతూంది.

కంపార్టుమెంటులోకి వెళ్ళి ప్రేమలతా వేంకట రమణమూర్తి "ప్రేమవల" నవల తీసేను. ఎందుకోగాని "ప్రేమవల" చదవాలనిపించలేదు! ●

# చిత్రసీమలో చరిత్రహీనులు

'ప్రతి మానవుడిదీ ఫొటోజెనిక్ ముఖమే' అంటాడు ఫిల్మ్ టెక్నిక్ మీద ప్రామాణిక గ్రంథాలు రాసిన రష్యన్ రచయిత. దర్శకుడు పుడోవ్కిన్. అయితే ఆ పాత్రకు. ఆ ముఖానికి సంబంధ బాంధవ్యాలు సశాస్త్రీయంగా కలవాలని ఆ మహనీయుని మరో ఉవాచ. ఈ దృష్టితో చూస్తే సినిమాలో సేనానాయకుడు పాత్ర వేసేవాడికి అంగ సౌష్టవం పుష్కలంగా వుండాలి. ముఖంలో గాంభీర్యం కొట్టొచ్చినట్టు కనపడుతుండాలి. ఈ విశిష్ట లక్షణాలనన్నిటిని పుణికి పుచ్చుకున్న నటులు తెలుగు సినిమా లోకంలో కొందరున్నారు. వారిలో భావనారుషి ఒకడు. పేరుకి ఆయన 'ఋషి' అయినా సేనా నాయకుడు వేషానికి ఆయన పెట్టింది పేరు. జెమినీ వారు హిందీలో తీసిన బ్రహ్మాండమైన చిత్రం 'చంద్రలేఖ'లో భావనారుషి సేనా నాయకుడు భూమికలో కనపడి జెమినీ అధినేత వాసన్ పొగడ్తలనందాడు. గుంటూరు మండలానికి చెందిన ఈ వస్తాదు యింత వరకు సుమారు వంద చిత్రాలలో బిగం కూడుకున్న తన భౌతిక కాయాన్ని మనకు కనపరిచాడు. 'ఆడపెత్తనం. సౌదామిని. మాయాలోకం. చిన్న కోడలు' మొదలయిన చిత్రాలు భావనారుషిలోని 'బలాఢ్యుడు'ని మనకు బాహాటంగా చూపెడతాయి. 'అన్నదమ్ములు'లోని ఆయన రౌడీ వేషాన్ని చూస్తే ప్రతి



ప్రేక్షకునకు ఆయన్ని చితకపొడవాలనే బుద్ధి పుట్టక మానదు. దీనిబట్టి చూస్తే రౌడీ భూమికలో ఆయన నటన పరాకాష్ఠ నందిందని చెప్పవచ్చు. సినిమా ప్రపంచంలో విలన్ వేషాలు వేసేవాళ్ళు అటు హీరో చేతిలో చచ్చేటట్లు దెబ్బలు తిన డమేకాక (నిజానికి విలన్ కాలెత్తి ఒక తన్ను తంతే మన హీరోలు కిందపడి మూడు పొల్లిగింతలు పెట్టక మానరు.) ప్రేక్షకుల బూతులకు. శాపనార్థాలకు లోనవడానికి సర్వ సంసిద్ధులుగా ఉండాలి. భావనారుషి వీటన్నిటిని రుచి చూసిన వాడవడంచేతనే నటనా జీవితంలో బండబారిపోయాడు. అయితే నిజ జీవితంలో ఆయన సాధు పుంగవుడని మనకు సునాయాసంగా బోధపడక మానదు. తన నటనా ప్రాగల్భ్యాన్ని కనపరచడానికి అవకాశం యిచ్చే చిత్రంకోసం. చిత్ర నిర్మాత కోసం ఒంటికాలిమీద తపస్సు (అతిశయోక్తి) చేసే భావనారుషి చిరునామా: 92, రంగరాజపురం. హైరోడ్. కోడంబాకం. మద్రాసు—600024.

—ఇంటూరి